సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 7 । మే । 2025




రత్నగిరికి పెళ్లి కళ
శ్రీ సత్యదేవుని కల్యాణోత్సవాలు వైశాఖ శుద్ధ దశమి, బుధవారం శ్రీకారం చుట్టుకుంటున్న శుభవేళ.. రత్నగిరి కల్యాణ శోభతో కళకళలాడుతోంది.

8లో



కుమార్తె కళ్ల ఎదుటే...
అల్లారుముద్దుగా పెంచిన కన్న తండ్రి కళ్లెదుటే రోడ్డు ప్రమాదలో మృత్యువాత పడటంతో ఆ కుమార్తె రోదన వర్ణనాతీతం.

సముద్రంలోకి 1,987 క్యూసెక్కులు


ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 1,987 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.10 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

రైతులకు అండగా నేడు వైఎస్సార్ సీపీ రిలే దీక్ష
- పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యాన అమలాపురంలో నిర్వహణ
- రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలి రావాలని పిలుపు


చిర్ల జగ్గిరెడ్డి

కొత్తపేట: కూటమి ప్రభుత్వ విధానాలతో రైతులకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యాన అమలాపురంలో బుధవారం 'రైతులకు అండగా వైఎస్సార్ సీపీ రిలే నిరాహార దీక్ష' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు జగ్గిరెడ్డి కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అకాల వర్షాలకు దెబ్బ తిన్న ధాన్యానికి కనీస గిట్టుబాటు ధర అందకపోవటంతో రైతుకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఇటువంటి పరిస్థితుల్లో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జగ్గిరెడ్డి అధ్యక్షతన ఈ రిలే దీక్ష నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అమలాపురం కలెక్టరేట్ సమీపాన పార్టీ నాయకుడు వంటెద్దు వెంకన్న నాయుడు కాంప్లెక్స్ వద్ద ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ దీక్ష సాయంత్రం 5 గంటల వరకూ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు అత్యధిక సంఖ్యలో తరలి వచ్చి, రిలే దీక్షను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కుట్టు మెషీన్ల పేరుతో భారీ అవినీతి


వంగా గిరిజా కుమారి

ఉప్పలగుప్తం: కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని పక్కన పెట్టి, బీసీలకు కుట్టు మెషీన్ల అందజేత పేరుతో రాష్ట్రంలో భారీ అవినీతికి పాల్పడిందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వంగా గిరిజా కుమారి ఆరోపించారు. సన్నవిల్లి గ్రామంలోని తన నివాసంలో మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 45 సంవత్సరాలు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళల ఖాతాల్లో ఎటువంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సంవత్సరానికి రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో రూ.75 వేలు జమ చేశారని చెప్పారు. తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్సే ధ్యేయంగా మహిళలకు ఎటువంటి సంక్షేమం అందించకుండా బీసీ మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ కార్యక్రమాన్ని తెర మీదకు తెచ్చిందని అన్నారు. ఒక్కో మహిళకు రూ.23 వేలు కేటాయించగా.. ఇందులో కుట్టు మెషీన్ ఖరీదు రూ.4,300, శిక్షణ కాంట్రాక్టర్‌కు రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7,300 అవుతోందన్నారు. మిగిలిన రూ.15,700 ఎవరి ఖాతాలోకి వెళ్తున్నాయని ప్రశ్నించారు. లక్ష మంది లబ్ధిదారులకు ప్రభుత్వానికయ్యే ఖర్చు రూ.73 కోట్లు అవుతుండగా.. టెండర్‌లో రూ.230 కోట్లు అని ప్రకటించడంలో మతలబు ఏమిటని గిరిజా కుమారి అన్నారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ
అమలాపురం రూరల్: ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకూ జరిగే ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) బీఎస్‌ఎల్ రాజకుమారి ఆదేశించారు. ఈ పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఫస్టియర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ 30 కేంద్రాల్లో జరుగుతాయన్నారు. అలాగే, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ ద్వితీయ సంవత్సరం పరీక్షలు 17 కేంద్రాల్లో జరుగుతాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఫస్టియర్ సప్లిమెంటరీకి 10,519 మంది, సెకండియర్‌కు 3,719 మంది కలిపి మొత్తం 14,238 మంది విద్యార్థులు హాజరు కానున్నారని వివరించారు. పరీక్ష సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కొనసాగించాలని, పంచాయతీ, మున్సిపల్ అధికారులు తాగునీరు ఏర్పాటు చేయాలని, పారిశుధ్యం మెరుగుపరచాలని సూచించారు. పరీక్ష కేంద్రాల రూట్లలో విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు నడపాలని డీఆర్‌ఓ ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి వనుము సోమశేఖరరావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ దుర్గారావుదొర తదితరులు పాల్గొన్నారు.

కష్టాల సాగు

- విత్తు నుంచి అమ్మకం వరకూ రైతుకు అడుగడుగునా గండాలు
- తొలుత ముంపుతో రబీ పంట ఆలస్యం
- కీలక సమయంలో నీటి ఎద్దడి
- శివారు, మెరక ప్రాంతాల్లో ఎండిన చేలు
- ఇంజిన్లతో తోడకం వల్ల అదనపు వ్యయం
- సర్కారు అస్తవ్యస్త కొనుగోలు విధానంతో దక్కని మద్దతు ధర
- ఏ సందర్భంలోనూ స్పందించని కూటమి ప్రభుత్వం

సాక్షి, అమలాపురం: ఆరుగాల శ్రమించే అన్నదాతకు రబీ వరి సాగులో విత్తు నుంచి పంట అమ్మకం వరకూ అడుగడుగునా గండాలే. ముందుగా విత్తుకుందామనుకుంటే ఖరీఫ్ సమయంలో కురిసిన వర్షాలతో నిలిచిపోయిన ముంపు చేలను వీడలేదు. ఒకవైపు ఖరీఫ్ పంట దెబ్బ తినడంతో పాటు.. ప్రభుత్వం నుంచి పరిహారం కానీ.. పెట్టుబడి ప్రోత్సాహం కానీ విడుదల కాలేదు. దీంతో, పెట్టుబడులకు రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పుల కోసం చేతులు చాచాల్సిన దుస్థితి వచ్చింది.

పంట పాలు పోసుకుని ఈనిక దశలో ఉన్న సమయంలో శివారు, మెరక ప్రాంతాలకు సాగు నీరు అందించడంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. ఇన్ని కష్టాలు పడి పంట పండిస్తే.. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్య విధానాలు రైతులను నిలువునా ముంచేశాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విత్తు నుంచి అమ్మకం వరకూ అన్నదాతలకు ప్రభుత్వం నుంచి ఒక భరోసా ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ భరోసా లేకుండా పోయింది.

శివార్లలో ఎండబెట్టారు


అల్లవరం మండలం తాడికోనలో మూడు రోజుల క్రితం నీటి ఎద్దడికి గురైన పంట పొలాన్ని చూపుతున్న రైతు

రబీకి నీటి ఎద్దడి వచ్చే అవకాశం లేదని అధికారులు చెప్పారు. పైగా సహజ జలాలు, సీలేరు పవర్ జనరేషన్ నీటి వల్ల రబీ కాలంలో ఏకంగా 116.806 టీఎంసీల నీటిని పంట కాలువలకు విడుదల చేశారు. అయినప్పటికీ కీలకమైన మార్చి, ఏప్రిల్ నెలల్లో జిల్లాలోని శివారు, మెరక ప్రాంతాలకు నీరందించడంలో జలవనరుల శాఖ విఫలమైంది. గింజ గట్టిపడాల్సిన సమయంలో నీరందకపోవడంతో ధాన్యం తాలు, తప్పలు వచ్చి, దిగుబడి పడిపోయింది.

అప్పులు చేసి పెట్టుబడులు



నేను సుమారు ఐదెకరాల్లో వరి సాగు చేస్తున్నాను. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా, ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టం జరిగితే ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా వంటి సాయం ఎప్పటికప్పుడు అందేది. పెట్టుబడులకు ఇబ్బంది ఉండేది కాదు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక కనీసం రైతు భరోసా కూడా ఇవ్వలేదు. దీంతో, అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో బొండాలు రకం ధాన్యం కూడా రూ.1,800కు కొనేవారు. ఇప్పుడు రూ.1,500కు కొంటున్నారు.

– నామాడి రాజారత్నం, రైతు, అవిడి, కొత్తపేట మండలం

ఇంజిన్‌తో తోడుకున్నా..



చేలకు నీరందక ఇంజిన్లతో తోడుకోవాల్సి వచ్చింది. కీలక సమయంలో సాగు నీరు అందక భూమి చౌడుబారి దిగుబడి తగ్గింది. గొల్లగరువులో 25 ఎకరాలు కౌలు వ్యవసాయం చేస్తున్నాను. ఇంజిన్లతో నీరు తోడేందుకు ఎకరాకు రూ.4 వేలు, నాట్లు వేసిన తరువాత నీరు తోడేందుకు రూ.6 వేలు అదనంగా ఖర్చయ్యింది. సాగు నీరు అందక చౌడుబారి పోవడంతో ఎకరాకు 30 బస్తాల దిగుబడి మాత్రమే వచ్చింది. దళారులు బస్తాకు రూ.150 తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.

– పులుగు దశరథ మహారాజు, కౌలు రైతు, పల్లంకుర్రు


రాజోలు మండలం కడలి వద్ద ఫిబ్రవరి మొదటి వారంలో..

ధాన్యం కొనుగోలు లేదు
జిల్లావ్యాప్తంగా 1.68 లక్షల ఎకరాల్లో రబీ వరి సాగు జరిగింది. 5,86,616 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. ప్రభుత్వం 379 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కేవలం 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు మాత్రమే అనుమతి ఇచ్చింది. ఇంతా చేసి 1.02 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. మిల్లర్లు మరో 80 వేల మెట్రి క్ టన్నులు కొనుగోలు చేశారు. ఇదే అదనుగా మిల్లర్లు 75కేజీల బస్తాకు రూ.150 నుంచి రూ.200 వరకూ తగ్గించి కొనుగోలు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బొండాల రకం కొనుగోలు దాదాపుగా లేదు. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో ఇప్పుడు మరో లక్ష టన్నులకు అనుమతి వచ్చిందని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

విత్తు దారి లేక..
ఖరీఫ్ ముగిసే సమయంలో కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన డెల్టా రైతులు రబీ సాగును కోటి ఆశలతో ప్రారంభించారు. కానీ, సకాలంలో విత్తనం జల్లుదామనుకుంటే శివారు ప్రాంతాల్లోని పొలాలను ముంపు వీడలేదు. జిల్లాలో మురుగు నీటి కాలువ వ్యవస్థ అధ్వానంగా మారడంతో ముంపు నీరు చేలల్లోనే ఉండిపోయింది. ముంపు వీడేంత వరకూ రోజుల తరబడి రైతులు ఎదురు తెన్నులు చూడాల్సి వచ్చింది. దీనికితోడు ఫిస్టియా పువ్వు కలుపు తొలగింపు రైతులకు తలకు మించిన భారమైంది. ఈ కారణంగా రైతులు ఫిబ్రవరి మొదటి వారంలో కూడా నాట్లు, వెదజల్లు సాగు చేయాల్సి వచ్చింది.



కె.గంగవరం మండలం కుందూరులో కొనుగోలు చేయని బొండాల రకం ధాన్యం



అదనపు పెట్టుబడి
ఖరీఫ్‌తో పోల్చుకుంటే రబీలో అదనపు పెట్టుబడి అవుతోంది. అటువంటిది ఈసారి రబీలో రైతులు మరింత పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. శివారు, మెరక చేలకు రైతులు డీజిల్ మోటార్లతో నీరు తోడుకోవాల్సి వచ్చింది. నీటి ఎద్దడి వల్ల కలుపు పెరగడం, ఫిస్టియా పువ్వు తొలగించాల్సి రావడం వంటి కారణాలతో ఎకరాకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకూ అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది.

ఉప్పలగుప్తంలో వాడపర్రు పంట బోదెలో నీరు పూర్తిగా లేకపోవడంతో మోటార్లతో నీటిని చేలకు మళ్లిస్తున్న రైతులు (ఫైల్)

పెట్టుబడులకు సొమ్ములు లేక..
ఈసారి రబీ సాగులో రైతులకు అతి పెద్ద కష్టం పెట్టుబడికి ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేయాల్సి రావడం. కోతల సమయంలో ఖరీఫ్ పంట వర్షాల బారిన పడింది. దీనికి ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేల మేర పెట్టుబడి సాయం ఇస్తామని గొప్పగా చెప్పారు. కానీ, నయాపైసా ఇవ్వలేదు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పీఎం సమ్మాన్ నిధి రూ.6 వేలతో కలిపి ఏటా రూ.13,500 క్రమం తప్పకుండా అందించేది. ఈసారి పీఎం సమ్మాన్ నిధి రూ.6 వేలు ఇచ్చారు కానీ కూటమి ప్రభుత్వం ఇస్తాన్న రూ.14 వేలు అందించలేదు. దీంతో పెట్టుబడుల కోసం రైతులు అప్పులు చేయాల్సిన దుస్థితి తలెత్తింది.



రైతుకు ఆర్థిక సాయం చేస్తామని టీడీపీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ

మురమళ్లలో కల్యాణాల టికెట్ల విడుదల
ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో జూన్, జూలై నెలలకు సంబంధించిన నిత్య కల్యాణాల టికెట్లు మంగళవారం విడుదల చేశారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఈ విషయం తెలిపారు. మొత్తం రెండు నెలలకు 7,076 కల్యాణాలకు టికెట్లు విడుదల చేయగా.. ఆన్‌లైన్‌లో 4,148, కార్యాలయంలో 2,928 అందుబాటులో ఉంటాయన్నారు. జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి మాస పూజలు రుద్ర హోమం, చండీ హోమం, లక్ష పత్రి పూజ కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు.

మరో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: రైతు సేవా కొనుగోలు కేంద్రాల (ఆర్‌ఎస్‌కే) ద్వారా జిల్లాలో మరో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రబీ దిగుబడి అంచనాల్లో 2 లక్షల మెట్రిక్ టన్నుల (34 శాతం) కొనుగోలుకు మాత్రమే ప్రభుత్వం తొలుత లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. జిల్లా యంత్రాంగం, మిల్లర్ల అభ్యర్థన మేరకు మరో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ఆమోదించారని తెలిపారు.

ఇందులో 40 వేల మెట్రిక్ టన్నులు బాయిల్డ్ రైస్, 60 వేల మెట్రిక్ టన్నులు రా రైస్ సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించారన్నారు. ఇప్పటి వరకూ జిల్లాలో లక్షా 2 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించి 24 గంటల్లోగా రైతు ఖాతాకు సొమ్ము జమ చేశామని చెప్పారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఏవైనా సమస్యలు, సందేహాలు ఉంటే జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూముకు 83094 32487, 94416 92275 నంబర్లలో సంప్రదించాలని జేసీ సూచించారు. తేమ శాతం 17 ఉంటే కనీస గిట్టుబాటు ధర చెల్లిస్తారని, 18 శాతం ఉంటే ఒక కేజీ, 19 శాతం ఉంటే 2 కేజీలు, 20 శాతం ఉంటే 3 కేజీలు, 21 శాతం ఉంటే 4 కేజీలు, 22 శాతం ఉంటే 5 కేజీలు, అంతకంటే ఎక్కువ ఉంటే 5 కేజీల మేర తరుగు విధించాల్సిందిగా మిల్లర్లను ఆదేశించామన్నారు. దీపం–2 పథకం కింద ప్రభుత్వం 4 నెలలకు ఒక సిలిండర్ ఉచితంగా అందిస్తోందని చెప్పారు. ప్రస్తుతం దీపం–2 రెండో దశ కొనసాగుతోందని, రెండో సిలిండర్ పొందేందుకు ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవాలని జేసీ నిషాంతి సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ.ఉదయ భాస్కర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.బాలసరస్వతి, అసిస్టెంట్ మేనేజర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అందుబాటులో ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్
కంబాలచెరువు (రాజమహేంద్రవరం): గత నెల 11 నుంచి 16వ తేదీ వరకూ జిల్లా వైద్య విధాన పరిషత్‌లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి స్వీకరించిన దరఖాస్తులకు సంబంధించి అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ లిస్టును ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి ఎం.పద్మ మంగళవారం ఈ విషయం తెలిపారు. ప్రభుత్వాసుపత్రుల్లోని ఖాళీ పోస్టులను కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు పూర్వపు తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఆ జాబితాను బుధవారం నుంచి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఈస్ట్‌గోదావరి.ఎన్‌ఐసీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఉంచుతున్నామని తెలిపారు.

గురి తప్పని బాణం


బాణం సంధిస్తున్న చిన్నారి నిత్యశ్రీ

- ఐదేళ్ల చిన్నారి నిత్యశ్రీ విశేష ప్రతిభ
- ఆర్చరీలో జాతీయ స్థాయి అండర్–10 విభాగంలో ప్రాతినిధ్యం
- బాణం సంధించడంలో ఔరా అనిపిస్తున్న చిన్నారి

పిఠాపురం: మాటలు నేర్చుకునే వయసులో ఆట బాట పట్టింది. ఐదేళ్ల ప్రాయంలో విల్లు ఎక్కుపెట్టి అలవోకగా లక్ష్యాన్ని ఛేదిస్తోంది. చిన్నారి కాదు చిచ్చర పిడుగు అనిపించుకుంటోంది. ఆర్చరీలో గురి తప్పని బాణంగా పేరు తెచ్చుకుంటోంది పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం గ్రామానికి చెందిన ముమ్మిడి సూర్య సాయి నిత్యశ్రీ. విలువిద్యలో ఆ చిన్నారి అద్భుత ప్రదర్శన ఔరా అనిపిస్తోంది. అతి పిన్న వయసులో జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికై సత్తా చాటింది.

నాలుగేళ్లకే సాధన.. ఐదేళ్లకే జాతీయ స్థాయికి..

నిత్యశ్రీ తండ్రి స్వామి గణేష్. ఓ ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి. తల్లి విజయ గృహిణి, చెల్లి సాయి కృతిక. యూకేజీ చదువుతున్న నిత్యశ్రీ గత ఏడాది వేసవి సెలవుల్లో పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ కళాశాలలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాల్లో ఆటలను వీక్షించేందుకు తండ్రితో కలిసి వెళ్లింది. విలువిద్యలో సాధన చేస్తున్న వారి చెంతకు వెళ్లి ఆసక్తిగా గమనించింది. సాధన చేస్తున్న వాళ్లంతా ఏకాగ్రతతో బాణం వేయడాన్ని ఆసక్తిగా గమనించింది. తానూ ఓ విల్లుతో లక్ష్యం వైపు గురి పెట్టింది. అది గమనించిన కోచ్ లక్ష్మణరావు ఆ చిట్టి చేతులకు సరిపడా పరిమాణంలో ఉన్న విల్లు, బాణం ఇచ్చి సంధించమని చెప్పారు. ఆ సమయంలో నిత్యశ్రీ బాణం సంధించడంలో ఎక్కడా పొరపాటు లేకుండా లక్ష్యాన్ని ఛేదించడాన్ని ఆశ్చర్యపోయారు. ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. అలా నాలుగేళ్లకే సాధన చేపట్టి ఐదో ఏటకు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై అందరినీ అబ్బురపరిచింది.



తొలి ప్రయత్నంలోనే..

నిత్యశ్రీ ఈ ఏడాది మార్చి 5న పిఠాపురంలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని, తొలి ప్రయత్నంలోనే స్వర్ణం సాధించింది. అదేరోజు రాష్ట్ర స్థాయి ఆర్చరీ ఎంపిక ట్రయల్స్‌లో విశేష ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ ఏడాది మార్చి 20 నుంచి 30మధ్య నాగార్జున యూనివర్సిటీ లో జరిగిన జాతీయ స్థాయి అండర్–10 విభాగంలో ప్రాతినిధ్యం వహించింది. అయితే త్రుటిలో పతకం కోల్పోయినా పలువురి ప్రశంసలందుకుంది. జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి పేరు తీసుకురావడమే తన లక్ష్యమంటోంది నిత్యశ్రీ. ఆ దిశగా ముమ్మర సాధన చేస్తోంది.

గర్వకారణం



బాణం వేస్తానని నాతో అన్నప్పుడు సరేనంటూ విల్లు ఇచ్చాను. మొదటిసారే గురి తప్పకుండా వేసింది. యాధృచ్ఛికమని మరోసారి ప్రయత్నించమన్నా. అలా పలుమార్లు చేయించినా గురి తప్పలేదు. ఆశ్చర్యపోయాను. నిత్యశ్రీ నాన్నతో చెప్పాను. ఆయన అంగీకరించారు. ప్రత్యేక శిక్షణలో ఏడాదికే ఇతరులతో పోటీ పడే స్థాయికి చేరుకుంది. తనకంటే పెద్దవారైనా సరే ఆమెతో పోటీ అంటే భయపడే స్థాయికి ఎదిగింది. ఇంత చిన్న వయసులో జాతీయ స్థాయికి ఎంపికవడం గర్వకారణం.

– పి.లక్ష్మణరావు, ఆర్చరీ కోచ్


యుద్ధానికి సిద్ధం (రాష్ట్ర స్థాయి పోటీల్లో జాతీయ స్థాయి ఎంపికకు సిద్ధమంటున్న, నిత్యశ్రీ)



గురి పెట్టి వదిలిన బాణంలా జాతీయ స్థాయికి వెళ్లింది

బాణాలే కొనమనేది



చిన్నప్పుడు ఎక్కడకు తీసుకెళ్లినా బొమ్మలు కొనరా అని అడిగితే బాణాలే చూపించేది. వాటితోనే ఆడుకునేది. సొంతంగా పుల్లలతో బాణాలు తయారు చేసేది. ఇంత చిన్న వయసులో ఇంత గొప్పగా ప్రతిభ కనబరుస్తుందని ఊహించలేదు. మీ అమ్మాయి ఎంత బాగా ఆడుతుందోనని అందరూ అంటుంటే ఆ ఆనందం వర్ణనాతీతం.

– ముమ్మిడి స్వామి గణేష్, నిత్యశ్రీ తండ్రి

క్లుప్తంగా

ఆటో బోల్తా పడి ముగ్గురికి గాయాలు

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేట గ్రామ శివారులో మంగళవారం పంట కాలువలో ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికుల సహకారంతో ఆటోని బయటకు తీసుకువచ్చారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం పొంగుటూరుకు చెందిన కుటుంబం తాళ్లపూడి లో జరిగిన ఓ ఫంక్షన్‌కి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు సమాచారం. సంఘటన జరిగిన వెంటనే అన్నదేవరపేట వాసులు స్పందించి హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని ఆటోని పంట కాలువలోంచి బయటికి తీశారు. స్వల్పంగా గాయపడ్డ ప్రయాణికులను ఇంటికి పంపించారు.

అత్యాచార యత్నంపై కేసు నమోదు

గోపాలపురం: మహిళపై అత్యాచారయత్నం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా అతనికి 14రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు వెంకటేశు ఈ నెల 5వ తేదీన వివాహిత మహిళ ఒంటరిగా ఉన్న సమయంలో ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి ఆమెపై అత్యాచారం చేయడానికి ప్రయత్నించినట్లు బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటేశును అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బ్యాగ్‌లో రూ.1.73 లక్షల మాయం

కొవ్వూరు: నిడదవోలు నుంచి కొవ్వూరు వస్తున్న ఆర్టీసీ బస్సులో తన బ్యాగ్‌లో ఉంచిన రూ.1.73 లక్షల నగదు మాయం అయినట్లు మద్దాల లక్ష్మి సాయి రామజ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఏఎస్సై జీజీ ప్రకాష్ తెలిపారు. నిడదవోలు మండలం శింగవరం గ్రామానికి చెందిన ఈమె తన అత్తకు అనారోగ్యంగా ఉండడంతో నిడదవోలులో ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చూపించారు. అనంతరం ఇద్దరూ కలసి ఆర్టీసీ డిపోకి వెళ్లి అక్కడి నుంచి కొవ్వూరు వచ్చారు. టోల్ గేట్ జంక్షన్ వద్ద దిగి చూసుకుంటే బ్యాగ్‌లో దాచి ఉంచన సొమ్ము మాయం అయినట్లు గుర్తించారు. బాధితురాలు స్వగ్రామం (తల్లిదండ్రుల గ్రామం) దొమ్మేరుకు వస్తుండగా ఈ చోరీ జరిగినట్లు ఆయన తెలిపారు.

వేధింపులపై కేసు

కొవ్వూరు: తనను పదిహేను నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకుని ఐదు నెలల నుంచి అదనపు కట్నం తీసుకుని రమ్మని వేధిస్తున్నట్టు బోరోతు లక్ష్మి గాయత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఎం.సత్యనారాయణ తెలిపారు. మొదట్లో తాను తీసుకొచ్చిన బంగారం ఆభరణాలు అమ్ముకుని ఐదు నెలలుగా ఇంటి వద్దే ఉంటూ మద్యం సేవించి అదనపు కట్నం తీసుకుని రావాలంటూ భర్త జెట్టి శివాజీ వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేసిందన్నారు. ఆయన తల్లిదండ్రులు సైతం ఆయనకు సహకరిస్తున్నట్లు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



విద్యుత్ దీపాలంకరణతో శోభిల్లుతున్న రత్నగిరి (ఫైల్)

రత్నగిరికి పెళ్లి కళ

- నేటి నుంచి సత్యదేవుని కల్యాణోత్సవాలు
- వారం రోజుల పాటు వేడుక
- ఘనంగా ఏర్పాట్లు

అన్నవరం: శ్రీ సత్యదేవుని పెళ్లి ఉత్సవాలు వైశాఖ శుద్ధ దశమి, బుధవారం శ్రీకారం చుట్టుకుంటున్న శుభవేళ రత్నగిరి కల్యాణ శోభతో కళకళ లాడుతోంది. కల్యాణ మహోత్సవాలు బుధవారం ప్రారంభమవుతున్నాయి. గురువారం రాత్రి సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవారి దివ్యకల్యాణం జరగనుంది. వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో రోజుకొక వేడుకతో భక్తులకు కనువిందు కలుగనుంది. ఈ నెల 13వ మంగళవారం రాత్రి జరిగే శ్రీపుష్పయాగంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు శ్రీసత్యదేవుడు, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెలను చేస్తారు. రత్నగిరిపై అనివేటి మండపంలో పండితుల మంత్రోచ్ఛాటన మధ్య జరిగే ఈ కార్యక్రమంలో ముత్తయిదువులు పసుపు దంచుతారు. రాత్రి ఏడు గంటలకు రాజా రామరాయ కళావేదిక మీద స్వామి అమ్మవార్లకు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు.

రూ.కోటి వ్యయంతో ఏర్పాట్లు

శ్రీసత్యదేవుని కల్యాణ మహోత్సవాలకు రూ.కోటి వరకు ఖర్చు చేస్తున్నారు. విద్యుత్ అలంకరణకు రూ.25 లక్షలు, మిగిలిన మొత్తాన్ని రంగులు, పుష్పాలంకరణ, స్వామి, అమ్మవారి అలంకరణకు , భద్రతాచర్యలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఊరేగింపులు, వైదిక కార్యక్రమాలకు కేటాయించారు.



వధూవరుల అలంకరణలో దర్శనమివ్వనున్న సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారు

ఏర్పాట్లు పరిశీలించిన పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు

సత్యదేవుని కల్యాణ మహోత్సవం ఏర్పాట్లను పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు మంగళవారం పరిశీలించారు. ప్రధానంగా కల్యాణం జరిగే వేదిక, దాని ముందు కల్యాణం తిలకించేందుకు విచ్చేసే వీఐపీలు, భక్తులకు చేపడుతున్న ఏర్పాట్లు డీఎస్పీ అడిగి తెలుసుకున్నారు. 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఆయన వెంట ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు తదితరులున్నారు.

అన్నవరంలో నేడు



తెల్లవారుజామున : 3.00 గంటలకు సుప్రభాతసేవ
ఉదయం: 8.00 గంటలకు చతుర్వేద పారాయణ
సాయంత్రం: 4.00 గంటలకు అనివేటి మండపంలో శ్రీసత్యదేవుడిని, అమ్మవారిని పెండ్లికుమారుని, పెండ్లికుమార్తెను చేయుట.
రాత్రి: 7-00 గంటలకు : శ్రీరాజా వేంకట రామారాయ కళామందిరంలో ఎదుర్కోలు ఉత్సవం
రాత్రి: 9-00 గంటలకు: వెండి ఆంజనేయ వాహనంపై సీతారాముల ఊరేగింపు
సాంస్కృతిక కార్యక్రమాలు: రత్నగిరి కళావేదిక మీద, కొండదిగువన ఉదయం ఏడు నుంచి పది గంటల వరకు సాయంత్రం ఐదు నుంచి రాత్రి 11 గంటల వరకు

కల్యాణ వేదిక ముస్తాబు

గురువారం రాత్రి తొమ్మిది గంటల నుంచి రామాలయం పక్కన గల కల్యాణ మండపంలో స్వామివారి కల్యాణం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వేదిక వెనుక వైపు నుంచి కూడా కల్యాణం తిలకించేలా స్క్రీన్స్ ఏర్పాటు చేయనున్నారు. సుగంధ భరిత పుష్పాలతో ఆలయ ప్రాంగణం, అనివేటి మండపం, స్వామివారి కల్యాణ వేదిక, వేదిక ముందు గల విశ్రాంతి మండపాన్ని అలంకరిస్తున్నారు.



సత్యదేవుని కల్యాణం నిర్వహించే వార్షిక కల్యాణ మండపం

కల్యాణ ఉత్సవాల షెడ్యూల్

బుధవారం

- సాయంత్రం నాలుగు గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారిని వధూవరులను చేసే కార్యక్రమం. రాత్రి తొమ్మిది గంటలకు కొండ దిగువన ఆంజనేయ వాహనంపై సీతారాముల ఊరేగింపు

గురువారం

- ఉదయం తొమ్మిది గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం, కంకణ ధారణ, రుత్విక్కుల దీక్షా వస్త్రధారణ,
- రాత్రి ఏడు గంటలకు కొండదిగువన స్వామి వారు వెండి గరుడ వాహనం మీద, అమ్మవారు వెండి గజ వాహనం మీద, సీతారాములు వెండి పల్లకీ మీద ఊరేగింపు రాత్రి తొమ్మిది గంటల నుంచి కల్యాణం

శుక్రవారం

- రాత్రి ఏడు గంటలకు : అరుంధతి నక్షత్ర దర్శనం, తొమ్మిది గంటలకు కొండ దిగువన రావణబ్రహ్మ వాహనం మీద స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

శనివారం

- మధ్యాహ్నం 2-30 గంటలకు: అనివేటి మండపంలో వేద పండిత సదస్యం. రాత్రి తొమ్మిది గంటలకు సత్యదేవుడు, అమ్మవారిని పొన్న వాహనంపై ఊరేగింపు

ఆదివారం

- సాయంత్రం 4 గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల వన విహారోత్సవం, ఐదు గంటలకు నూతన రథంపై సత్యదేవుడు, అమ్మవార్ల గ్రామోత్సవం

సోమవారం

- ఉదయం 9-00 గంటలకు పంపా సరోవరంలో స్వామి, అమ్మవార్లకు శ్రీచక్రస్నానం, సాయంత్రం నాలుగు గంటలకు నీలలోహిత గౌరీపూజ, నాకబలి, దండియాడింపు, ధ్వజా అవరోహణ, కంకణ విమోచన

మంగళవారం

- రాత్రి 7-30 గంటలకు నిత్యకల్యాణ మండపంలో శ్రీపుష్పయాగం

అథ్లెటిక్స్‌లో నాగబాబుకు 3 కాంస్య పతకాలు



పతకాలతో నాగబాబు

కరప: మైసూర్‌లో ఇటీవల జరిగిన 44వ నేషనల్ వెటరన్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఓపెన్ చాంపియన్ షిప్ మీట్-2025లో మూడు కాంస్య పతకాలు సాధించిన కరప సబ్‌యూనిట్ మలేరియా అధికారి యాతం నాగబాబును మంగళవారం కరప, వేళంగి పీహెచ్‌సీలలో వైద్యాధికారులు, సిబ్బంది అభినందించారు. కాకినాడ జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ కార్యాలయంలో కరప సబ్‌యూనిట్ మలేరియా అధికారిగా పనిచేస్తున్న నాగబాబు గత నెల 21 నుంచి 23వరకు మైసూర్‌లో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో 100, 400, 800 మీటర్ల పరుగు పందేలలో మూడింటిలోనూ మూడవ స్థానంలో నిలిచి మూడు కాంస్యపతకాలు సాధించారు. కరప, వేళంగి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వి.ఏంజలిన్, డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్‌లు ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఇతర సిబ్బంది నాగబాబును అభినందించారు. 2013 నుంచి ఇప్పటివరకు రాష్ట్ర, జాతీయ, జిల్లా స్థాయిలో జరిగిన మాస్టర్స్, అథ్లెటిక్స్, పరుగుపందేలలో 100, 200, 400, 800, 1500 మీటర్ల, రిలే పరుగుపందేలలో పాల్గొని 64 పతకాలు సాధించినట్టు నాగబాబు తెలిపారు. ఇందులో 15 బంగారు, 19 వెండి, 30 కాంస్య పతకాలు ఉన్నాయన్నారు.

పోలీసు బందోబస్తుతో బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు



పాశర్లపూడిలో ధర్నా చేస్తున్న నిర్వాసితులు



నిర్వాసితులతో చర్చిస్తున్న పోలీసులు

- పాశర్లపూడిలో తీవ్ర ఉద్రిక్తత
- పోలీసుల అదుపులో నిర్వాసితులు

మామిడికుదురు: పాశర్లపూడి గ్రామంలోని కైకాలపేటలో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. 216వ నంబర్ జాతీయ రహదారి వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు ఎన్‌హెచ్, రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రయత్నించారు. దీన్ని నిర్వాసితులు అడుకోవడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. తమకు సెంట్ల రూపేణా పరిహారం ఇస్తామంటున్నారని అలా కాకుండా గజాల లెక్కన, ప్రస్తుత మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలని నిర్వాసితులు కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఎంతోకాలం నుంచి పోరాటం చేస్తున్నా తమకు న్యాయం చేయడం లేదంటూ తీవ్రంగా మండిపడ్డారు. నిర్వాసితులైన మహిళలు కూడా ధర్నాలో పాల్గొన్నారు. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు, నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీగా మోహరించారు. ఎన్‌హెచ్ ఏఈఈ వెంకటరమణ, ఎమ్మార్వో శరణ్య నిర్వాసితులతో మాట్లాడారు. తమకు న్యాయం జరిగే వరకు పనులు జరగనిచ్చేది లేదంటూ నిర్వాసితులు ధర్నా చేశారు. ఏడేళ్ల నుంచి పోరాటం చేస్తున్నామని, తమకు అడుగడుగునా అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో న్యాయం జరగడం లేదని గెడ్డం గంగాధర్, చొల్లంగి ధర్మరాజు, గెడ్డం లెనిన్, పెచ్చెట్టి చంద్రరావు వాపోయారు. పోలీసులు దౌర్జన్యం చేస్తున్నారంటూ తీవ్రంగా మండిపడ్డారు. దీంతో పనులను అడ్డుకుంటున్న నిర్వాసితులు నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం భారీ బందోబస్తు నడుమ బైపాస్ రోడ్డు పనులు ప్రారంభించారు. పాశర్లపూడి గ్రామంలోని బైపాస్ రోడ్డు నిర్మాణానికి 66 మంది రైతులకు చెందిన ఏడెకరాల భూమికి సంబంధించి సమస్య ఏర్పడిందని అధికారులు తెలిపారు. దీనిలో 10 మంది రైతులు నష్ట పరిహారం తీసుకున్నారన్నారు. మిగిలినవారు పరిహారం తీసుకోలేదని చెప్పారు. ఇందులో 16 మంది రైతులకు సంబంధించి 1.32 ఎకరాల భూమిని ఇచ్చేందుకు నిర్వాసితులు నిరాకరించడంతో ఇంత కాలం బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు నిలిచిపోయాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు చేపట్టామని చెప్పారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,000
గటగట (వెయ్యి)	19,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	18,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER
■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి : 7406393937 [HA-459]

FOR SALE
■ వాటర్ ప్లాంట్ అమ్మబడును. మంచి రన్నింగ్‌లో ఉన్న 2000 లీ॥ కెపాసిటీ గల ప్లాంట్ & కూలింగ్ టిన్స్ అమ్మబడును. సంప్ర॥ 93985 76997 [SCA25003369]

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2622]

Wanted
■ కాకినాడ వాకలపూడిలోని ఆవానా ట్రేడియన్ ఆఫీస్‌లో పనిచేయుటకు స్త్రీ/ పురుషులు కావలెను. వయస్సు 18-30 సం॥లు విద్యార్హత డిగ్రీ, జీతం : 8,000/- నుండి 10,000/- Cont ✆ : 94403 96004, 94924 33897 [R-920]

■ శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను,పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావాలి. ఫ్రీ వసతి భోజనం. జీ: 18K. ఫోన్: 9912011499, 9912011899 [SCA-25003226]

■ కన్సల్టెన్సీ కాదు VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9182260297 [HA-532]

Goods

FURNITURE SALE
■ రాజమండ్రి:-బేకరీ మరియు స్వీట్స్ స్టాళ్ళకు అవసరమైన సెకండ్ హేండ్ షోకేసు ఫర్నీచర్ అమ్మబడును. సంప్ర॥ 92465 50443 [R-SCA25003359]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఏటిగట్లకు రక్షణ పనులు

- వరదలను ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నాం
- ఎస్ఈ గోపీనాథ్



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ గోపీనాథ్

ధవళేశ్వరం: బలహీనంగా ఉన్న ఏటిగట్లను గుర్తించామని, తాత్కాలికంగా అక్కడ పటిష్ట పనులు చేపడతామని వరదల అనంతరం శాశ్వత నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్ పేర్కొన్నారు. ధవళేశ్వరంలోని ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఇరిగేషన్ అధికారులు, సిబ్బందితో ఆయన వరదలను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ కూళ్ళ, సుందరపల్లి, కుండలేశ్వరం తదితర ప్రాంతాల్లో ఏటిగట్లు బలహీనంగా ఉన్నట్లు గుర్తించామని, అక్కడ తాత్కాలిక రక్షణ చర్యలు చేపడతామన్నారు. కాజా ఈస్ట్ కొక్కిలేరు, కడలి తదితర ప్రాంతాల్లో బలహీనంగా ఉన్న ఔట్‌ఫాల్ స్లూయిజ్ స్థానంలో కొత్తవి నిర్మించడానికి 9.4 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా పటిష్టం చేసి వరదల అనంతరం నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు. వరదల్లో 20 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరినా తట్టుకునే విధంగా ఏటిగట్లు ఉన్నాయని వెల్లడించారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకొని వరదలను ఎదుర్కోవాలని సూచించారు. డిప్యూటీ ఎస్ఈ జీ కనకేష్, హెడ్‌వర్క్స్ ఈఈ కాశీ విశ్వేశ్వరరావు, తూర్పు డెల్టా ఈఈ వి.రామకృష్ణ, మధ్య డెల్టా ఈఈ బి శ్రీనివాస్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కొవ్వూరు: పట్టణంలో జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న మద్దుల వెంకట రామకృష్ణ ఈ నెల ఐదో తేదీ నుంచి కనిపించడం లేదని అందిన ఫిర్యాదు మేరకు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. ఈయనకు ముగ్గురు సంతానం ఉన్నారని, చేసిన అప్పులు తీర్చడం భారంగా మారడంతో సోమవారం ఇంటి నుంచి బయటి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదని రామకృష్ణ తండ్రి శ్రీహరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- కేదారిలంక వద్ద గోదావరిలో ఇద్దరు గల్లంతు
- ఒకరి మృతదేహం లభ్యం
- ధనమ్మమర్రి సందర్శనకు వచ్చిన యువకులు



దాసరి సాయిరాం (ఫైల్)



మొండెం రాంబాబు (ఫైల్)



కేదారిలంక ఘటనా స్థలంలో సీఐ దొరరాజు

కపిలేశ్వరపురం: గోదావరిలో స్నానానికి దిగిన యువకుడు జారిపడి మృతిచెందాడు. మరో యువకుడు గల్లంతయ్యాడు. మండపేట పట్టణం శ్రీనగర్‌కు చెందిన అవివాహితుడు దాసరి సాయిరాం (28), పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన వివాహితుడు మొండెం రాంబాబు, మంగళవారం కపిలేశ్వరపురం మండలం కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలోని ధనమ్మమర్రికి దైవ దర్శనానికి వెళ్లారు. వారితో పాటు మరో ఇద్దరు కూడా వెళ్లారు. దర్శనం అనంతరం గోదావరి నదిలో స్నానానికి దిగారు. ప్రమాదవశాత్తూ జారిపడి మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, ఎస్సై డి.రవికుమార్ పరిశీలించారు. శవపంచనామా అనంతరం మృతదేహాలను మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీఆర్వో వెంకటేశ్వరరావు ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు సీఐ దొరరాజు తెలిపారు.

నెలక్రితం ఇదే విధంగా..

ఒకసారి ప్రమాదం జరిగిందంటే మరోసారి జరక్కుండా ఉండేలా ఎవరికి వారు జాగ్రత్త పడతారు. అదే బాధ్యత ప్రభుత్వానికీ ఉండాలి. ఏప్రిల్ 5న కపిలేశ్వరపురం మండలం కేదారిలంకలో గోదావరిలో యువకుడు స్నానానికి దిగి మృతిచెందాడు. దుర్ఘటన జరిగిన నెలరోజులకే అదే గ్రామంలో మరో ప్రమాదం మంగళవారం జరిగింది. ఏప్రిల్‌లో జరిగిన ప్రమాదం జరిగిన తర్వాత మరో ప్రమాదం జరక్కుండా తగిన చర్యలు తీసుకోని ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కుమార్తె కళ్ల ఎదుటే...

రోడ్డు ప్రమాదంలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటరమణ మృతి



బత్తిన వెంకటరమణ (ఫైల్)



వెంకటరమణ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్



ఘటన స్థలంలో వెంకటరమణ మృతదేహం

ధవళేశ్వరం: అల్లారుముద్దుగా పెంచిన కన్న తండ్రి కళ్ల ఎదుటే రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువాత పడటంతో ఆ కుమార్తె రోదన వర్ణనాతీతం. రోజూ ఉద్యోగం కోసం వెళ్లే తనను బస్సు ఎక్కించేందుకు తీసుకువెళ్లే తండ్రి తిరిగిరాని లోకాలకు చేరడంతో ఆ కుమార్తె రోదనలు చూపరులకు కన్నీళ్లు తెప్పించాయి. తండ్రితో బైక్‌పై ఆమె వెళుతున్న ప్రయాణం అదే ఆఖరని ఆమె ఊహించి ఉండకపోవచ్చు. ధవళేశ్వరం ప్రధాన రహదారిపై యూనియన్ బ్యాంక్ సమీపంలో మంగళవారం ఉదయం ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బత్తిన వెంకటరమణ (56) మృత్యువాత పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి... బొబ్బిల్లంకకు చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బత్తిన వెంకటరమణ కుటుంబంతో కలిసి కొంతమూరులో నివాసం ఉంటున్నారు. మృతుడు వెంకటరమణ పెద్ద కుమార్తె మనీష ముక్తేశ్వరం యూనియన్ బ్యాంక్‌లో పీవోగా పనిచేస్తున్నారు. రోజూ కుమార్తెను రాజమహేంద్రవరంలో బస్సు ఎక్కించి వెంకటరమణ విధులకు వెళ్లేవారు. వేమగిరి చెక్‌పోస్టు వద్ద మంగళవారం విధులు నిర్వర్తించేందుకు వెళుతున్న వెంకటరమణ కుమార్తెను ధవళేశ్వరంలో బస్సు ఎక్కించేందుకు బైక్‌పై వస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ప్రమాదంలో వెంకటరమణ తలపై నుంచి ఆర్టీసీ బస్సు వెళ్ళడంతో అక్కడికక్కడే ఆయన మృతి చెందారు. ప్రమాదంలో బైక్ వెనుక కూర్చున్న వెంకటరమణ కుమార్తె మనీష స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సంఘటన తెలుసుకున్న ధవళేశ్వరం సీఐ టి గణేష్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ మృతి చెందడంతో పోలీసు సిబ్బందిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. జిల్లా ఎస్పీ టి.నరసింహకిశోర్ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో వెంకటరమణ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ధవళేశ్వరం ఎస్సై హరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.